నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. భాగ్యనగర్ ఫీడర్ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీ, కేపీహెచ్‌బీ మెయిన్ రోడ్డు, కళామందిర్ రోడ్డు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. ఎన్‌టీఆర్‌నగర్, కేటీఆర్‌కాలనీ, పీజేఆర్ నగర్‌లలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

లోధా సబ్‌స్టేషన్ పరిధిలో..

మూసాపేట: లోధా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమ లింగప్ప తెలిపారు. కేపీహెచ్‌బీ ఏడో ఫేజ్ ప్రాంతంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

ప్రజావాణిలో 27 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. 27 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. టౌన్‌ప్లానింగ్ 11, ఎలక్ట్రికల్ 1, ఇంజినీరింగ్ 7, డీడీ, పార్కు 2, డీపీఓ 1, శానిటేషన్ 4, ఎస్‌ఈ 1 మొత్తం 27 ఫిర్యాదులు అందాయని పేర్కొనారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించామని అన్నారు.

ఆర్థిక సాయం



సిరాజ్ కుటుంబీకులకు ఆర్థిక సాయం చేస్తున్న మారెళ్ల శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలోని గవర్నమెంట్ స్కూలు వెనుక నివాసముంటున్న సిరాజ్‌కు రెండు కిడ్నీలు ఫెయిలై, డయాలసిస్ చికిత్స చేయించుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు సోమవారం సిరాజ్‌ను పరామర్శించారు. అనంతరం చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆయన ఆర్థిక సాయం అందజేశారు.

ఎలుకల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల ప్రాంతానికి చెందిన కొలగామి మధుసూదన్‌రావు కుమారుడు వెంకటేష్ (42) పదేళ్ల క్రితం బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి భార్యతో కలిసి కేపీహెచ్‌బీకాలనీలోని మూడో ఫేజ్, ఎల్ఐజీలో నివాసం ఉంటున్నాడు. మూడు నెలల క్రితం భార్య కాన్పు కోసం పుట్టింటికి వెళ్లింది. ఈనెల 1న వెంకటేష్ తన తండ్రి మధుసూదన్‌కు ఫోన్ చేసి తనకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయని.. తాను తట్టుకోలేక ఎలుకల మందు తాగినట్లు తెలిపాడు. వెంటనే మధుసూదన్ ఆ ఇంటి యజమానికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో వెంటనే వారు అక్కడి వెళ్లి వెంకటేష్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు మధుసూదన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన విరాల ప్రకారం... గుంటూరు జిల్లాకు చెందిన కొండూరు శివకృష్ణ (42) ఆరు నెలలుగా కేపీహెచ్‌బీకాలనీలోని సుజిత్ హాస్టల్‌లో నివసిస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న శివకృష్ణ ఏ పని చేయకుండా ఖాళీగానే ఉంటున్నాడు. అయితే మద్యానికి అలవాటు పడిన శివకృష్ణ ఆదివారం మధ్యాహ్నం వరకు గదిలో నుంచి బయటకు రాలేదు. దీంతో అతని రూమ్‌లో ఉన్నవారు వెంటనే విషయాన్ని బాచుపల్లిలో నివాసం ఉండే బంధువు కొండూరు శ్యామ్‌కిషోర్‌కు చెప్పారు. కిషోర్ వచ్చి చూడగా శివకృష్ణ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్యామ్‌కిషోర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డుపై గతనెల 30వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందటంతో పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



పంచశీల పాఠశాలలో అక్షరాభ్యాసంలో చిన్నారులు



శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్‌లో వసంత పంచమి వేడుకల్లో విద్యార్థులు



మూసాపేట: వసంత పంచమి పర్వదినం సందర్భంగా కూకట్‌పల్లి జోన్ వ్యాప్తంగా ఉన్న అమ్మవారి ఆలయాలు, పాఠశాలల్లో సోమవారం సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ సాయి విద్యానికేతన్‌లో....

మూసాపేటలోని శ్రీ సాయి విద్యానికేతన్ స్కూల్‌లో సరస్వతీదేవికి విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గార్లపాటి సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులకు తెలుగు సంస్కృతి సంప్రదాయాలపై చిన్నప్పటి నుంచే అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం..

మోతీనగర్: మూసాపేట, అల్లాపూర్ డివిజన్లలోని దేవాలయాల్లో సోమవారం సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మూసాపేట డివిజన్‌లోని శ్రీ శృంగేరి శారద శంకరమఠం ఆవరణలోని సరస్వతీదేవికి పంచామృతంతో అభిషేకం, నూతన వస్త్ర అలంకరణ నిర్వహించారు. అనంతరం అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అదే విధంగా పాఠశాలలోని చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు.

ఇది తిరోగమన బడ్జెట్

కేంద్రం కష్టజీవుల కడుపుకొట్టి కార్పొరేట్ల జేబులు నింపుతోంది: సీపీఎం

కూకట్‌పల్లి: కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి ఎం.శంకర్, నాయకులు భీమేశ్వరరావు, బి. శ్రీను, పి.ధర్మారావు, బి.రాములు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కష్టజీవుల కడుపులు కొట్టి కార్పొరేట్ల జేబులు నింపే విధంగా ఉందన్నారు. ఢిల్లీ, బిహార్ రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆ రాష్ట్రాలకు మేలు చేసే విధంగా ఈ బడ్జెట్‌ను రూపొందించారని మండిపడ్డారు. తెలంగాణకు గుండు సున్నా చూపించారని తెలిపారు. మధ్య తరగతి వారికి రూ.12లక్షల వరకు పన్నులు కట్టే అవసరం లేదని చెబుతూనే పేదలు, కార్మికులు, సామాన్యులపై నిత్యావసర సరుకుల ధరలు పెంచే విధంగా ఈ బడ్జెట్ ఉందన్నారు.

◆ విద్య, వైద్యానికి, ఉపాధికి ఈ బడ్జెట్‌లో నిధులు భారీగా తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి, రైతాంగానికి భారీగా నిధుల కోత విధించారని తెలిపారు. ఈ బడ్జెట్ బడా బాబుల బొజ్జ నింపేలా మధ్య తరగతిని మభ్య పెట్టేలా ఉందని విమర్శించారు. దేశానికి ఇది తిరోగమన బడ్జెట్ అని అన్నారు. కార్మికులు, శ్రామికులు, కష్టజీవులు, సామాజిక వర్గాలు, అసంఘటిత కార్మికులు ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్, శివస్వామి, నారాయణ, వీరయ్య, వెంకటయ్య, భారతమ్మ, నీలావతి, చక్రమ్మ, రవి, అనిత తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ కూకట్‌పల్లి భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద నిరసన తెలిపిన సీపీఎం నాయకులు

ఇళ్ల దరఖాస్తుల స్వీకరణకు అధికారుల నియామకం

జంట సర్కిళ్ల పరిధిలో 11 ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఉపకమిషనర్లు బండి గంగాధర్, వంశీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జంట సర్కిళ్ల పరిధిలోని 11 వార్డుల్లో 11 ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

◆ ఓల్డ్ బోయిన్‌పల్లి జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం, సుదర్శన్ కుమార్, ఫోన్ 9959442432. బాలానగర్‌లో సునీల్ 7331170683, కూకట్‌పల్లిలో సాయిప్రసన్న 7995007398. వివేకానందనగర్‌లో 9849639766. హైదర్‌నగర్‌లో 9989908068. ఆల్విన్‌కాలనీలో శ్రీనివాస్ 9989930181. కేపీహెచ్‌బీ కాలనీవార్డు కార్యాలయంలో శంకర్ 8897507965. బాలాజీనగర్‌లో టీకే ప్రభాకర్ 9849907651. అల్లాపూర్‌లో బి.కార్తిక్ 9154295227. మూసాపేటలో జమీలుద్దీన్ 9949619958. ఫతేనగర్ వార్డు కార్యాలయంలో కె.మురళి 9000554761 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను స్వీకరించటంతో పాటు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోల్‌బాల్ టోర్నీలో తెలంగాణ జట్టుకు కాంస్యం

జట్టులో హెచ్‌సీయూ విద్యార్థి లక్కీమిరానీ (దివ్యాంగుడు)



రాయదుర్గం: దృష్టిలోపం ఉన్న అథ్లెట్ల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన గోల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హెచ్‌సీయూ పీజీ విద్యార్థి లక్కీ మిరానీ జట్టు కాంస్యపతకం సాధించింది. లక్కీ మిరానీ ఇంటిగ్రేటెడ్ పోస్టుగ్రాడ్యుయేషన్‌లో పొలిటికల్ సైన్స్ చదువుతున్నాడు. ఇటీవల మహారాష్ట్రలోని గోండియాలో 4వ గోల్‌బాల్ జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టులో లక్కీ మిరానీ ఉన్నారు. దేశవ్యాప్తంగా ఈ పోటీలలో మొత్తం 17 జట్లు పోటీపడ్డాయి. అందులో తెలంగాణ జట్టుకు మూడవ స్థానం లభించింది. ఈ సందర్భంగా లక్కీ మిరానీని పలువురు ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులు అభినందించారు.

ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ తీరుపై కార్పొరేటర్ ఆరా

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అని చెప్పి ప్రజలను వేధించే పాలనను చేస్తోందని వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు పేర్కొన్నారు. సోమవారం వివేకానందనగర్ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా వార్డు ఆఫీసులో ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్నా సర్వే లిస్టులో రాని వారికి కొత్త దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. గతంలో ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తులు స్వీకరించి అందులో 40శాతం మాత్రమే ఎంట్రీలు చేశారన్నారు. ఎంట్రీలు అయిన వాటిలో కూడా కేవలం ఒక్క పథకం మాత్రమే అందుకుంటున్న ప్రజలు ఎంతోమంది ఉన్నారని అన్నారు. కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ కేవలం ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే స్వీకరించటం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏవైతే ఆరు గ్యారంటీలు అని చెబుతోందో వాటిని కూడా స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు చేసిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కేవలం వెరిఫికేషన్ మాత్రమేనని అన్నారు. దరఖాస్తు చేసుకున్న పేదలకు ఇళ్లు ఎప్పటి వరకు ఇస్తారు? ఎక్కడ ఇస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే ప్రజల తరపున అమలు చేసే వరకు పోరాడుతామని తెలిపారు.



దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు

పారిశుద్ధ్య కార్మికులకు రుణమేళా

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీలో స్వచ్ఛ ఉద్యం యోజన ద్వారా పారిశుద్ధ్య కార్మికులు, చెత్త సేకరణ కార్మికులకు ఆటోలు ,సెప్టిక్ ట్యాంకులు జేసీబీలు.. ఇతర వాహనాలకు 50 శాతం సబ్సిడీపై రుణాలిచ్చేందుకు సోమవారం రుణమేళాను నిర్వహించారు. కార్యక్రమంలో స్కీమ్ సౌత్ ఇండియా ఇన్‌చార్జి కె.సహదేవయ్య, ఎన్.చిన్నకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... పథకం గురించి లబ్ధిదారులకు వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, స్టేట్ కో ఆర్డినేటర్ మల్లేష్‌రాజు పాల్గొన్నారు.

సొంత డబ్బుతో శ్మశానవాటికలో చెత్త తొలగింపు పనులు



ముస్లిం శ్మశానవాటికలో జేసీబీతో చెత్త తొలగింపు పనులు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తదితరులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటలోని ముస్లిం శ్మశానవాటికలో పరిశుభ్రత కార్యక్రమాన్ని సోమవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పరిశీలించారు. ముస్లిం శ్మశానవాటిక కమిటీ సభ్యుల కోరిక మేరకు తన సొంత నిధులతో ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 14 శ్మశానవాటికలను పరిశీలించారన్నారు. వాటిలో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఇర్ఫాన్, ముస్లిం కమిటీ అధ్యక్షుడు మీర్ మజార్ హుస్సేన్, కమిటీ సభ్యులు, నాయకులు చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా తిరుకల్యాణ మహోత్సవం



ఆల్విన్‌కాలనీ: నిజాంపేట్ రోడ్డులోని సెవెన్‌హిల్స్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం దివ్య తిరుకల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, దేవాలయం ఈఓ సత్యనారాయణ, భక్తులతో కలిసి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. ఈ మహోత్సవంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కేఆర్‌కే రాజు, పోతుల రాజేందర్, శ్రీహరి, పద్మ, సాంబశివరెడ్డి, అప్పిరెడ్డి, కిరణ్‌కుమార్, కడియాల శివ, సుజాత, భక్తులు పాల్గొన్నారు.



'ప్రగతినగర్‌కాలనీ అభివృద్ధికి నా సహకారం ఉంటుంది'



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రగతినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ప్రగతినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే గాంధీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రగతినగర్‌కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు బైపోతు తిరుపతిరావు, జనరల్ సెక్రటరీ విజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ప్రేమ్‌రాజు, ట్రెజరర్ శివాల రాము, ఎండి ఇబ్రహీం, ఆస్‌బెస్టాస్ కాలనీ అధ్యక్షులు నరేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ చోడవరం 9th ఎడిషినల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A. 280/2024, A.S. 224/2019

Between:
పూసర్ల నూకయ్యశెట్టి ..... పిటీషనరు/ అప్పిలెంటు
And
పూసర్ల రామారావు వగైరా ..... రెస్పాండెంట్లు
To, 2,3 రెస్పాండెంట్లు
2) Kadimisetty Venkata Padmini, Calling herself Poosarla Venkata Padmini, W/o. Visweswara Rao, C/o. Gupta Residency, Pragathi Nagar, K.P.H.B. Colony, Hyderabad - 500090
3) Poosarla Sai Sravan, S/o. late Sivaram, C/o. Kadimisetty Venkata Padmini, Calling herself Poosarla Venkata Padmini, Gupta Residency, Pragathi Nagar, K.P.H.B. Colony, Hyderabad - 500090

U/or 9R7 Notice

పై నెంబరు అప్పీలులో శ్రీ కోర్టు వారు తే: 16-11-2023 దీన జారీ చేయించిన అర్డరును రద్దుపర్చ కోరి పై నెంబరు I.A. 280/2024రు పిటీషనును పిటీషనరు దాఖలు చేసియుండగా, సదరు కోర్టు వారు మీకు పలుమార్లు Notice అర్డరు చేయగా, సదరు Notice లను మీకు పలుమార్లు పంపినప్పటికీ మీరు తప్పించుకొని తిరుగుచూ యున్నందున, ఈ ప్రకటన మూలంగా మీకు తెలియజేయమని కోర్టు వారు అర్డరు చేసియున్నారు. అందుచే యీ ప్రకటన మూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటీషను తే: 21-02-2025దీకి వాయిదా అయియున్నది. సదరు వాయిదా రోజున ఉదయం 10-30 గం॥లకు మీరు పై కోర్టునందు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

Chodavaram
Dt: 04-02-2025
K.Srinivas, Advocate for Petitioner
Cell: 9885830233

ఆకతాయిల వీరంగం.. యువకుడిపై దాడి

గచ్చిబౌలి: మద్యం మత్తులో ఆకతాయిలు రోడ్లపై వీరంగం చేస్తున్నారు. వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నారు. మణికొండలోని పోచమ్మబస్తీలో కొందరు యువకులు అర్ధరాత్రి దాటాక రోడ్లపై తిరుగుతూ వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఓ యువకుడిని అటకాయించి దాడికి పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హకీంపేట్ స్పోర్ట్ స్కూల్‌లో డిగ్రీ చదివే విద్యార్థి వి.నాగార్జునరెడ్డి పార్ట్ టైం రాపిడో బైక్ నడుపుతాడు. మణికొండ పోచమ్మ బస్తీలో నివాసం ఉంటున్న అతను సోమవారం తెల్లవారు జామున 2.40 గంటల సమయంలో రాపిడో రైడ్‌కు బయలుదేరాడు. బస్తీలో 12 మంది యువకులు రోడ్డుకు అడ్డంగా బైక్‌లు నిలిపారు. వారిని చూసి నాగార్జున పక్క నుంచి వెళుతుండగా బూతులు తిట్టారు. పట్టించుకోకుండా వెళుతుండగా వెనక నుంచి బైక్‌లపై వెళ్లి కొట్టారు. భయపడి యువకుడు తిరిగి ఇంటికి రాగా అక్కడకు వచ్చిన ఆకతాయిలు మళ్లీ గొడవకు దిగారు. కుటుంబ సభ్యులు రావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఓ బైక్‌ను పట్టుకొని రాయదుర్గం మొబైల్ పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని దాడికి పాల్పడిన కొందరిని గుర్తించామని ఎస్ఐ జగదీష్ తెలిపారు.

'రీసెర్చ్ మెథడాలజీస్'పై ఆడిట్ కోర్సు ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయు యూనివర్సిటీలో రీసెర్చ్ మెథడాలజీస్ అనే అంశంపై వారం పాటు నిర్వహించే ఆడిట్ కోర్సు సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం యూజీసీ హెచ్‌ఆర్‌డీసీ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ ప్రొ. వి.బాలకిష్టారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజ శ్రేయస్సుకు దోహదపడే పరిశోధనలు చేయాలన్నారు. నేటి కాలనికి తగ్గట్లుగా మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ అవసరం ఉందని పేర్కొన్నారు. ఇన్నోవేటివ్ ఉత్పత్తులు రాబట్టడానికి ఇలాంటి పరిశోధనలు ఎంతో అవసరమని తెలిపారు. ఏవియేషన్ వంటి రంగాల్లో పెరుగుతున్న అవకాశాలను వినియోగించుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ తులసీరాందాస్ తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే సంస్థల పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, ప్రముఖ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, జేఎన్‌టీయూహెచ్ అధ్యాపకులు వారం పాటు నిర్వహించే కోర్సులో పలు అంశాలపై పాఠాలు బోధించి అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నారు.



ఆడిట్ కోర్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రొ. బాలకిష్టారెడ్డి

ప్రజలు ఇబ్బందులు పడకుండా చూసుకుంటా

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కేపీహెచ్‌బీ డివిజన్‌లోని శ్మశానవాటిక, పార్కులను పరిశీలిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, శ్మశానవాటికలను సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ముందుగా ఎస్‌ఆర్‌ఎస్‌పి కాలనీలోని పార్కును పరిశీలించి వాలీబాల్ కోర్టుగా అభివృద్ధి చేయాలని, భగత్‌సింగ్ నగర్, ఎస్‌ఆర్‌ఎస్‌పి కాలనీ లింక్‌రోడ్డు అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. డైమండ్ ఎస్టేట్స్‌లోని ఓపెన్ ప్లేస్ ఫ్లోరింగ్ పూర్తి చేసి దాని చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టి బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం 7వ ఫేజులోని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికలను పరిశీలించారు. అందులో భాగంగా ముస్లిం శ్మశానవాటికకు ముఖద్వారం నిర్మాణం చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అదే విధంగా కాంపౌండ్‌వాల్, టాయ్‌లెట్‌ల నిర్మాణం చేపట్టాలన్నారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో శ్మశానవాటికలు, పార్కుల అభివృద్ధి కోసం పనులు ప్రారంభించామన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన అభివృద్ధిని కూడా ఆపేసి ఒక్క అడుగు కూడా ముందుకు పడకుండా చేస్తున్నారని అన్నారు.అయినా ప్రజలకు మౌలిక సదుపాయాలకు ఇబ్బంది లేకుండా చూసుకుంటానని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సాయిబాబు చౌదరి, అధికారులు డీఈ శంకర్, ఏఈ సాయిప్రసాద్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ ఎస్‌ఆర్‌పీ శ్రీనివాస్, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

